సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024

దారులన్నీ అమ్మ సన్నిధికే..

మార్గశిర మాసోత్సవాల సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రీతికరమైన గురువారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు, వేదపండితుల సమక్షంలో పసుపు, కుంకుమ, పాలు, సుగంధద్రవ్యాలు కలిపిన జలాలతో శాస్త్రోక్తంగా అభిషేకాలు చేశారు. భారీగా భక్తులు సిరులతల్లిని దర్శించుకున్నారు. 8లో





సరదాల సింగారం







చల్లని సాయంత్రం...సాగర తీరం..పిల్లలు, యువతీయవకులు, చిన్నాపెద్దా తేడా లేకుండా సంద్రం చెంతకు చేరిపోయారు. వయసు మరిచి సరదాగా గడిపారు. చిన్నపిల్లల్లా మారిపోయారు. మహిళలు కబడ్డీ..కబడ్డీ అంటూ కూత పెట్టారు. ఆర్‌కే బీచ్ వద్ద యువత ఆటపాటలతో సందడి చేశారు. ఒకరిపై నుంచి మరొకరు దూకుతూ, పరుగులు తీస్తూ ఆడుకున్నారు. ఇసుకతో శరీరాన్ని కప్పేస్తూ చిలిపి ఆటలతో గడిపారు. మరికొందరు సముద్ర తీరంలో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కెరటాలను చూస్తూ తన్మయత్వానికి లోనవగా, పర్యాటకులు సముద్ర తీరంలో ఫొటోలకు ఫోజులిస్తూ దర్శనమిచ్చారు. - ఏయూ క్యాంపస్, -ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్లు, విశాఖపట్నం

వాల్ చిత్రాలు వావ్

జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో ఫ్లవర్ గార్డెన్ అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. గార్డెన్‌లో గోడలకు వాల్ ఆర్ట్ పనులు ఆకట్టుకుంటున్నాయి. అపెక్స్ పెయింటింగ్‌తో చూడ చక్కని చిత్రాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. అక్కయ్యపాలెం కూడలి నుంచి పోర్టు ఆసుపత్రి కూడలి వరకు ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆహ్లాదకరమైన పార్కులు, వాకింగ్ ట్రాక్‌లతో అభివృద్ధి చేసింది. -సీతంపేట



హరిదాసు.. రయ్‌రయ్

నెలగంట పెట్టిన నాటి నుంచి సంక్రాంతి వరకు హరిదాసుల సందడి కనిపిస్తుంది. హరిదాసుల జీవనం కూడా కాలంతో పాటు ఎన్నో మార్పులకు లోనవుతోంది. గతంలో ఎంతదూరమైనా కాలినడకనే వెళ్లే హరిదాసులు నేడు కాలంతో పాటు కాస్త మారుతున్నారు. వీరు మోటారు వాహనాలను, స్కూటీలను వినియోగిస్తున్నారు. అదే విధంగా ఒక హరిదాసు కిర్లంపూడి లే అవుట్‌లో మోపెడ్‌పై వెళుతూ కనిపించాడు. -ఏయూక్యాంపస్



భారం.. ఘోరం



మధ్య తరగతి సొంతింటి కలను చెరిపేయడానికి కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. తిరోగమనంలో ఉన్న స్థిరాస్తి రంగంపై పిడుగు వేయనుంది. ఈ నెలలో విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులకు షాకిచ్చిన చంద్రబాబు ప్రభుత్వం.. వచ్చే కొత్త సంవత్సరం కానుకగా రిజిస్ట్రేషన్ల చార్జీలు పెంచేందుకు సిద్ధమైంది. ఇప్పటికే విశాఖలో భూముల విలువ సవరణకు సంబంధించిన కసరత్తు పూర్తయింది. జిల్లాలో 20 నుంచి 50 శాతం మేర చార్జీలు పెంచాలని నిర్ణయించింది. దీంతో ఇళ్లు, ఓపెన్ ప్లాట్లు, వెంచర్లలో స్థలాలతో పాటు వ్యవసాయ భూములు కొనుగోలు చేసే వారిపై జనవరి 1వ తేదీ నుంచి మోయలేని భారం పడనుంది.

నిన్న విద్యుత్.. నేడు భూములపై బాదుడు

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపునకు నిర్ణయం


- కొత్త సంవత్సరం కానుకగా జనవరి 1 నుంచి పెంచిన చార్జీలు అమలు
- జిల్లాలో 20 నుంచి 50 శాతం మేర భూముల విలువ పెంపు
- పూర్తయిన కసరత్తు ఉన్నతాధికారుల నుంచి ఆమోదం
- తిరోగమనంలో స్థిరాస్తి రంగం

నగర పరిసర ప్రాంతాల్లో పెరిగే భూముల విలువ **20%**

శివారు ప్రాంతాల్లో **25-50%**

పీఎంపాలెం, మధురవాడ, గాజువాక ప్రాంతాల్లో **25-35%**

కాపులుప్పాడ, పెందుర్తి, భీమిలి ప్రాంతాలు **50%**



విశాఖ సిటీ: కొత్త ఏడాది నుంచి జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెరగనున్నాయి. ప్రాంతాన్ని బట్టి 20 నుంచి 50 శాతం చార్జీల పెంపునకు అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు మూడు నెలలుగా మార్కెట్ విలువలను సవరించే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. జిల్లాలో ఉన్న 9 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో తహసీల్దార్లు, జీవీఎంసీ జోనల్ కమిషనర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల ద్వారా భూముల ధరల సమాచారాన్ని సేకరించారు. వాటిని క్రోడీకరించి ఎంత మేర సవరించాలన్న విషయంపై తుది అంచనాలు తయారు చేశారు. ఆ సవరణల జాబితాకు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ కూడా ఆమోద ముద్ర వేసింది. దీని ప్రకారం నగర పరిసర ప్రాంతాల్లో 20 శాతం మేర, శివారు ప్రాంతాల్లో 25 నుంచి 50 శాతం వరకు పెరగనుంది. ఇళ్లు, ప్లాట్లతో పాటు అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా భారీగా పెరగనున్నాయి. పీఎంపాలెం, మధురవాడ, గాజువాక ప్రాంతాల్లో 25 నుంచి 35 శాతం, కాపులుప్పాడ, పెందుర్తి, భీమిలిలో కొన్ని ప్రాంతాల్లో 50 శాతం మేర చార్జీలు అధికం కానున్నాయి. నగర పరిసర ప్రాంతాల్లో మాత్రం పెద్దగా వ్యత్యాసం ఉండే అవకాశం లేదు. అయితే మధురవాడ, మిథిలాపురి కాలనీ, కాపులుప్పాడ, బోయపాలెం, పెందుర్తి, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో ప్లాట్ల చార్జీలు భారం కానున్నాయి. అపార్ట్‌మెంట్లకు భూమి విలువతో పాటు చదరపు అడుగుల్లో నిర్మాణ విలువను కూడా లెక్కిస్తున్నారు. ఈ విధానంలో ప్లాట్ల ధరలకు రెక్కలు రానున్నాయి. అలాగే భీమిలి, పెందుర్తి ప్రాంతాల్లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ విలువ భారీగా పెరగనుంది.

నేటి నుంచి కొత్త ధరల ప్రదర్శన

భూముల విలువల సవరణ ప్రతిపాదనలకు జిల్లా కమిటీ ఆమోదం తెలిపింది. శుక్రవారం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో కొత్త ధరలు ప్రజలకు అందుబాటులో ఉంచనున్నారు. ఈ నెల 24వ వరకు అభ్యంతరాలు/సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు. అభ్యంతరాల పరిశీలన ఈ నెల 26వ తేదీ వరకు జరగనుంది. తుది చార్జీల జాబితాకు 27న మార్కెట్ విలువ సవరణ కమిటీ ఆమోద ముద్ర వేయనుంది. 2025 జనవరి 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలు చేయనున్నారు.

మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు

మూలిగే నక్కపై తాటి పండు పడినట్లు ఉంది స్థిరాస్తి రంగం పరిస్థితి. జిల్లాలో అంతంత మాత్రంగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగంపై ఈ భూముల విలువ సవరణ మరింత ప్రభావం చూపించే అవకాశం ఉంది. గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో విశాఖ పరిపాలన రాజధానిగా ప్రకటించిన తరువాత జిల్లాలో రియల్ రంగం జోరందుకుంది. గతంలోనే ఎన్నడూ లేని స్థాయిలో బహుళ అంతస్థుల ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. బడా రియల్ ఎస్టేట్ సంస్థలు సైతం విశాఖలో గేటెడ్ కమ్యూనిటీలు, విలాసవంతమైన విల్లాల ప్రాజెక్టులు చేపట్టేందుకు ముందుకు వచ్చాయి. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత విశాఖ రాజధాని అయ్యే అవకాశం లేకపోవడంతో స్థిరాస్తి రంగం పూర్తిగా కుదేలైంది. ఇప్పటికే ప్లాట్లు, ఫ్లాట్ల విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగడంతో అది రియల్ ఎస్టేట్‌పై తీవ్ర ప్రభావం చూపనుందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

రెవెన్యూ సదస్సులో టీడీపీ నేతల బెదిరింపులు



డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లిని వేలెత్తి చూపుతూ బెదిరిస్తున్న టీడీపీ కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు

- వైఎస్సార్ సీపీ నేత పల్లా పెంటారావును బెదిరించిన టీడీపీ కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు
- పోలీస్ స్టేషన్‌కు తరలించి, బైండోవర్

అక్కిరెడ్డిపాలెం: గాజువాక జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల్ని టీడీపీ నేతలు బెదిరింపులకు గురిచేస్తూ, అవమానించారు. స్థానిక సమస్యలపై నివేదించే అవకాశం ఇవ్వకుండా నువ్వెవడివిరా అంటూ మాట్లాడేందుకు వీల్లేకుండా వ్యవహరించారు. తొలుత స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవో నెం.301ను మళ్లీ అందుబాటులోకి తెచ్చి గాజువాక భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఈ సదస్సులు వచ్చే నెల 8 వరకు జరుగుతాయని, రెవెన్యూ సమస్యలను సదస్సు దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సదస్సులో మాట్లాడేందుకు డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా వెంకటరావు ప్రయత్నించారు. స్టేజ్‌పైనే ఉన్న టీడీపీ కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు కలుగుజేసుకుని నువ్వెవడివిరా మాట్లాడేందుకు.. ఇది మా ప్రభుత్వం అంటూ బెదిరింపులకు దిగారు. దీంతో సదస్సులో కాసేపు గందరగోళం నెలకొంది. ఎమ్మెల్యే కలుగుజేసుకుని సదస్సులో ఉన్న సీఐ పార్థసారథితో మాట్లాడి, గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన సదస్సుల్లో కూడా పెంటారావు ఇబ్బందికరంగా వ్యవహరించాడని, స్టేషన్‌ను తీసుకుపోండని చెప్పడంతో పోలీసులు స్టేషన్‌కు తరలించారు. రాత్రి వరకు స్టేషన్లో ఉంచి బైండోవర్ చేసి, వదిలిపెట్టారు. తన భర్తను విడుదల చేయాలని చినతల్లి కోరినా.. ఎమ్మెల్యే చెప్తేనే వదులుతామంటూ.. తన భర్త వద్దనున్న సెల్‌ఫోన్‌ను సైతం తీసుకున్నారని ఆమె వాపోయింది. సదస్సులో కార్పొరేటర్లు ఉరుకూటి చందు, బొడ్డు నర్సింహపాత్రుడు, పల్లా శ్రీనివాసరావు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

4న విశాఖ వేదికగా నేవీ విన్యాసాలు

- హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఏర్పాట్లపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమీక్ష



నేవీ విన్యాసాల ఏర్పాట్లను సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్

మహారాణిపేట: జనవరి 4న విశాఖ వేదికగా నిర్వహించనున్న నావికాదళ విన్యాసాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం సమీక్షించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన అధికారులకు పలు సూచనలిచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. సామాన్య ప్రజలకు అసౌకర్యం కలగకుండా బారికేడ్లు, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి సదుపాయం, వేడుకలను ఎక్కడికక్కడ తిలకించేలా భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

4న లేజర్, డ్రోన్ షో: విన్యాసాలు నిర్వహించే జనవరి 4న సాయంత్రం ఆర్కే బీచ్‌లో ఓపీ డెమోతో పాటు లేజర్ షో, డ్రోన్ షో, నౌకల పైనుంచి విన్యాసాలు కూడా ఉంటాయని నేవీ అధికారులు తెలిపారు. 2న ఫుల్ రిహార్సల్స్ నిర్వహిస్తామన్నారు. నేవీ తరఫున కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జిల్లా యంత్రాంగం సహకరించాల్సిందిగా కోరారు. సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీ అజిత, నేవీ కమాండర్లు వై.కె.కిషోర్, మనోజ్‌కుమార్, లెఫ్టినెంట్ కమాండర్లు సంజీబ్ శరణ్, ఉజైర్ కుస్రో, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో బది'లీల'లు..!

- 11 రైతుబజార్ల ఈవోలకు స్థానచలనం
- బదిలీ ఉత్తర్వులపై అంతా గోప్యత



విశాఖ విద్య: జిల్లాలో రైతుబజార్ల సిబ్బంది బదిలీలకు వాణిజ్య, మార్కెటింగ్‌శాఖ అధికారులు తెరలేపారు. ఎస్టేట్ అధికారులను బదిలీ చేస్తూ గురువారం పొద్దుపోయాక ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై సంబంధిత శాఖ అధికారులు గోప్యత పాటిస్తుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. జిల్లాలో మొత్తం 13 రైతుబజార్లు ఉండగా, వీటిలో 11 చోట్ల ఎస్టేట్ అధికారులకు స్థానచలనం కలిగిస్తూ, ఉత్తర్వులు వెలువడినట్లు ప్రచారం జరుగుతోంది. బదిలీలకు సంబంధించిన సమాచారం కొంతమంది ఎస్టేట్ అధికారులకు వాట్సప్ ద్వారా చేరటంతో, సర్వత్రా చర్చనీయాంశమైంది. ఎవరెవరికి బదిలీ అయింది..? ఎక్కడికి బదిలీ అయిందనే దానిపై ఎస్టేట్ అధికారులు హైరానా పడ్డారు. పెందుర్తి, ములగాడ ఎస్టేట్ అధికారులు అక్కడ విధుల్లో చేరి రెండేళ్లు పూర్తికాకపోవటంతో వారిని బదిలీల నుంచి మినహాయించినట్లు తెలుస్తోంది. మిగతా రైతుబజార్ల ఎస్టేట్ అధికారులను బదిలీ చేసినట్లుగా చెప్పుకుంటున్నారు. అయితే బదిలీల వ్యవహారంపై తీవ్ర ఆక్షేపణలు వినిపిస్తున్నాయి. విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలు వద్దని, కొంతమంది సిబ్బంది ఉన్నతాధికారులకు విన్నవించినా, ఇవేమీ పట్టించుకోకుండా బదిలీలపై ముందుకెళ్లటం గమనార్హం. ఇదిలా ఉండగా,ఈవోల బదిలీల్లో పెద్ద ఎత్తున పైరవీలు చోటుచేసుకున్నాయని, కూటమి నేతల సిఫార్సులకు పెద్దపీట వేశారన్న ప్రచారం ఉంది. వాస్తవంగా అయితే చిన్న రైతు బజార్లలో పనిచేసిన ఎస్టేట్ అధికారులను, ఈ దఫా పెద్ద రైతు బజార్లుకు బదిలీ చేయాల్సి ఉంది. కానీ పెద్ద రైతుబజార్లలో పనిచేసిన కొంతమంది. తిరిగి అదే స్థాయిలో వ్యాపార కార్యకలాపాలు సాగే రైతు బజార్లకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. శివారు ప్రాంతాల్లోని రైతు బజార్లుకు బదిలీ అయిన కొంతమంది ఎస్టేట్ అధికారులు దీని పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చే సేందుకు సిద్ధమౌతు న్నట్లు సమాచారం బదిలీ ఉత్తర్వులను శుక్రవారం నాడు ఎస్టేట్ అధికారులకు పంపించి, వెంటనే రిలీవ్ అయ్యేలా వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారులు అంతా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

అహల్యా బాయి జీవితం ఆదర్శం



కళాకారిణి నృత్య ప్రదర్శన

విశాఖ విద్య: అహల్యాబాయి హోల్కర్ జీవితం నేటి తరానికి ఆదర్శం అని విశాఖ పోక్సో కోర్టు జడ్జి ఆనంది అన్నారు. మహిళా సమన్వయం సంస్థ గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌతమ బుద్ధ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యుద్ధానికి వచ్చిన శత్రు రాజు రఘురామాకు సందేశం పంపి యుద్ధం నుంచి వెనక్కి మళ్లించిన అహల్యాబాయి హోల్కర్ తీరు నేటికీ ఆదర్శమన్నారు. ఆ రోజుల్లో పెద్ద సమస్యగా ఉన్న గజ దొంగలను సంస్కరించి వారితో సేవా కార్యక్రమాలు చేయించారని కొనియాడారు. సామాజిక సమరసతా వేదిక అఖిల భారత సంయోజక్ పి. శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ఆ రోజుల్లోనే వరకట్నాన్ని, కుల రుగ్మతలను వ్యతిరేకించి నిరసించిన గొప్ప పాలకురాలు అహిల్యాబాయి అని చెప్పారు. ఈ సందర్భంగా అహల్యాబాయి జీవిత చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు. రాష్ట్ర సేవికా సమితి ప్రాంత ఉపాధ్యక్షురాలు ఉజ్వల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత మహిళా సమన్వయం బృందాలు కోలాటాన్ని , కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు.



మాట్లాడుతున్న పోక్సో కోర్టు జడ్జి ఆనంది

ఓటరు జాబితా సవరణలో అప్రమత్తం

జిల్లా అధికారుల సమీక్షలో రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకుడు ప్రవీణ్ కుమార్

మహారాణిపేట: ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకుడు ప్రవీణ్ కుమార్ సూచించారు. గురువారం విశాఖ విచ్చేసిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఓటరు జాబితా సంక్షిప్త సవరణ -2025పై సమీక్షించారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. స్థానికంగా ఉన్న జనాభాకు, ఓటర్లకు మధ్యనున్న వ్యత్యాసానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులకు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వామ్యం చేసుకుంటూ వారి సలహాలను, సూచనలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు జాబితాలను పరిశోధించి జనాభా నిష్పత్తికి, ఓటరు నిష్పత్తికి భారీ వ్యత్యాసం వచ్చినట్లయితే క్షేత్రస్థాయి పర్యటన చేసి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో భాగంగా జిల్లాలో చేపట్టిన చర్యలను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వివరించారు. అక్టోబర్ 29న ప్రచురించిన డ్రాఫ్ట్ ప్రకారం జిల్లాలో 20,14,236 మంది ఓటర్లు ఉన్నారని, జెండర్ రేషియో 1027 ఉందని పేర్కొన్నారు. అక్టోబర్ 29 తర్వాత 4,275 అభ్యంతరాలు రాగా 3,855 పరిష్కరించామని, ఇంకా 420 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమావేశానికి హాజరైన ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పలు అంశాలను ఎన్నికల జాబితా పరిశీలకుని దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఓటర్ల జాబితాలో తప్పిదాలు జరిగాయని, బోగస్ ఓట్లను స్వయంగా పరిశీలించి గుర్తించి, అధికారులకు నివేదించామని గుర్తు చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



జిల్లా అధికారులతో ఎన్నికల జాబితా పరిశీలకుడు కె.ప్రవీణ్ కుమార్, చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఎంటెక్ విద్యార్థిని ఆత్మహత్య

మృతురాలు శ్రీకాకుళం వాసి

ఎంవీపీకాలనీ: గాయత్రీ విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ చదువుతున్న సామినేని శిరీషా(22) ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా పొందూరుకు చెందిన శిరీషా ఎంటెక్ అభ్యసించేందుకు నగరానికి వచ్చింది. ఎంవీపీకాలనీలో తన అక్కాబావల వద్ద ఉంటూ చదువుకుంటోంది. అదే గ్రామానికి చెందిన దిలీప్‌తో ఆమెకు వివాహం జరగడంతో, వారం వారం పొందూరు వెళ్లి వస్తోంది. కాగా.. చదువు మధ్యలోనే శిరీషాకు పెళ్లి చేయడం, ఇటీవల ఆమె తండ్రి మరణించడంతో మనస్తాపానికి గురైంది. అలాగే వ్యవసాయ నేపథ్యం ఉన్న దిలీప్‌తో పెళ్లి చేయడం కూడా శిరీషాకు ఇష్టం లేనట్లు తెలిసింది. బుధవారం ఆమె అక్కాబావ వివాహ కార్యక్రమం కోసం వేరే ఊరు వెళ్లారు. దీంతో శిరీషా ఒక్కతే ఇంట్లో ఉంది. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున ఆమె ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు చాలాసార్లు ఆమె ఫోన్‌కు కాల్ చేసినా శిరీషా స్పందించకపోవడంతో కంగారుపడి, తెలిసిన వారికి సమాచారం ఇచ్చారు. వారు ఇంటి కిటికీ నుంచి చూడగా ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో పోలీసులు ఆమె మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆమె తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె రాత్రి ఎవరితో మాట్లాడింది? ఎందుకు ఆత్మహత్య చేసుకుందనే విషయాలు దర్యాప్తులో తేలుతాయని పోలీసులు తెలిపారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

భీమ్ సేన వార్ డిమాండ్

డాబాగార్డెన్స్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా భీమ్ సేన వార్ గురువారం ఆందోళనకు దిగింది. డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన నిరసనలో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, పలు దళిత సంఘాలు పాల్గొన్నాయి. జాతికి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని.. కేంద్ర హోంశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. అమిత్ షా చిత్రపటాలను కాళ్లతో తన్నుతూ చింపివేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకరరావు, భీమ్‌సేన వార్ ప్రతినిధి రాజేంద్రప్రసాద్, దళిత హక్కుల పోరాట సమితి ప్రతినిధి రాంబాబు తదితరులు మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేడ్కర్‌ను కించపరుస్తూ అమిత్‌షా తన వ్యాఖ్యలతో యావత్ భారతీయుల మనోభావాలను దెబ్బ తీశారన్నారు. అమిత్ షా వెంటనే జాతికి క్షమాపణ చెప్పి.. పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



అమిత్‌షా చిత్రపటాన్ని కాళ్లతో తన్నుతున్న దళితులు

దారులన్నీ అమ్మ సన్నిధికే..

- కనకమహాలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- ఘనంగా మార్గశిర మూడో గురువారం పూజలు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ జ్యోతిర్మయికి ప్రసాదం అందజేస్తున్న ఏఈవో తిరుమలేశ్వరరావు



క్యూలో వేచి ఉన్న భక్తులు



విరాళం అందజేస్తున్న నరేష్ కుటుంబ సభ్యులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. మార్గశిరమాసం మూడో గురువారం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే గాక రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. బుధవారం అర్ధరాత్రి నుంచే బారులుదీరారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేద మంత్రాలు, నాదస్వరాలతో ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం, వేద పారాయణాలు, శ్రీచక్రార్చన లక్ష్మీ హోమం నిర్వహించారు. పరిసర ప్రాంతాల ప్రజలు తీసుకొచ్చిన పసుపు కుంకుమ నీళ్లతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. పెద్ద ఎత్తున క్షీరాభిషేకం నిర్వహించి అమ్మవారికి పసుపు పూశారు. ప్రత్యేక పూజలు జరిపిన తర్వాత అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు ఈ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వెండి కవచాలు తొడిగారు. గురువారం మధ్యాహ్నం 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి మహానివేదన(రాజభోగం), సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు పంచామృతాభిషేక సేవ, సహస్రనామార్చన చేశారు. మిగిలిన సమయాల్లో భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. క్యూల్లో వేచి ఉన్న భక్తులకు దేవస్థానం మంచినీటి సౌకర్యం కల్పించింది. మధ్యాహ్నం 12 నుంచి వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. పోలీసులకు ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు తీసుకున్నప్పటికీ.. టూవే కావడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. భక్తుల సౌకర్యార్థం సింహాచలం, మధురవాడ నుంచి ఉచిత బస్ సర్వీసులు నడిపినట్లు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. ఏఈవో కె.తిరుమలేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది బందోబస్తు చేపట్టారు.



భద్రత చర్యలను పర్యవేక్షిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

కనకమహాలక్ష్మి అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వి.జ్యోతిర్మయి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ విప్ పీజీవీఆర్ నాయుడు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావు, సుందరపు విజయ్‌కుమార్‌చే ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కాగా.. ఉత్సవ ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా.. భక్తులకు సౌకర్యం కల్పించే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. దేవస్థానం అభివృద్ధికి ఎంవీపీకాలనీకి చెందిన ఎస్.నరేష్ రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో ఈవో కె.శోభారాణికి అందజేశారు.

జల వనరుల సంరక్షణలో దాతలు భాగస్వామ్యం కావాలి

మహారాణిపేట: జిల్లాలో చేపట్టబోయే జలవనరుల సంరక్షణ చర్యల్లో దాతలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ధాన్ ఫౌండేషన్, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో తీసుకున్న నిర్ణయాలపై, నిధుల సమీకరణపై గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. పలువురు దాతలు సమావేశానికి హాజరు కాగా జిల్లాలో జల వనరుల సంరక్షణకు చేపట్టబోయే చర్యలను, వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులకు, ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా యంత్రాంగం, ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహా క్రతువులో దాతలు భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం కలెక్టర్, ధాన్ ప్రతినిధులు, అధికారులు జలవనరుల సంరక్షణకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, అధికారులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

గోపాలపట్నం: ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి గవర వీధిలోని రెండు ఇళ్లలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 90వ వార్డు గవర వీధిలో మూడు అంతస్తుల భవనం ఉంది. పై అంతస్తులో గిడిజాల అప్పలనాయుడు కుటుంబం, మొదటి అంతస్తులో ఉమాదేవి నివాసం ఉంటున్నారు. శుభకార్యంలో పాల్గొనేందుకు మంగళవారం అప్పలనాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి పద్మనాభం మండలం విరాజీపురం వెళ్లారు. ఉమాదేవి కూడా బయటకు వెళ్లారు. అదే భవనంలో దిగువ అంతస్తులో ఉంటున్న మహిళ దుస్తులు ఆరబెట్టడానికి గురువారం ఉదయం మేడ పైకి వెళ్లింది. ఆ సమయంలో అప్పలనాయుడు, ఉమాదేవి ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించింది. ఊరికి వెళ్లిన వారు తిరిగి వచ్చారని ఆమె అనుకుంది. అయితే ఆరబెట్టిన దుస్తులు తీసుకురావడానికి సాయంత్రం మళ్లీ పైకి వెళ్లినప్పుడు ఎటువంటి అలికిడి లేకపోవడంతో అప్పలనాయుడు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం చెప్పింది. వారు వెంటనే ఇంటికి చేరుకుని.. చోరీకి జరిగినట్లు గుర్తించారు. తర్వాత క్రైం పోలీసులను ఆశ్రయించారు. సీసీఎస్ ఏసీపీ లక్ష్మణరావు, హార్బర్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సుదర్శన్ అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. రెండు ఇళ్లలో కలిపి సుమారు 9 తులాల బంగారం, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.



వివరాలు సేకరిస్తున్న సీఐ శ్రీనివాసరావు

అబాకస్ పోటీల్లో మధురవాడ బాలిక విశేష ప్రతిభ

మధురవాడ: అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో మధురవాడకు చెందిన చుక్కల జ్యోష్యశ్రీ దేవాన్షి విశేష ప్రతిభ కనబరించింది. ఢిల్లీ యూనివర్సిటీలో నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ చాంపియన్స్–2024 పేరుతో ఇటీవల జరిగిన ఈ పోటీల్లో ఏ2 విభాగంలో సెకండ్ రన్నరప్ సాధించింది. ఈ నెల 14న జరిగిన మ్యాథ్‌మెటిక్స్ స్పీడ్ పరీక్షలో 8 నిమిషాల్లో 200 లెక్కలకు 198 పూర్తి చేసింది. ఈ పోటీలకు ప్రపంచ వ్యాప్తంగా 30 దేశాల నుంచి 10 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్నేషనల్ అబాకస్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డినోవ్వాంగ్, ఇండియన్ అబాకస్ ప్రెసిడెంట్ డాక్టర్ స్నేహాల్ కారియా చేతుల మీదుగా చిన్నారి బహుమతి, అవార్డు అందుకుంది. దేవాన్షి బక్కన్నపాలెంలోని సెయింటాన్స్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతోంది. ఆమె తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. రావికమతం మండలం దొండపూడికి చెందిన వీరు ఉద్యోగరీత్యా పీఎంపాలెంలో నివాసం ఉంటున్నారు.



గెలుపొందిన ట్రోఫీతో జ్యోష్య శ్రీ దేవాన్షి

సైలర్ బలవన్మరణం

అల్లిపురం: సైలర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలివీ.. తూర్పు నావికాదళంలో తమిళనాడుకు చెందిన రంజిత్ (23) సైలర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ నుంచి సెలవులో ఉన్న అతను చావులమదుం వద్ద గల పవన పుత్ర లాడ్జిలో దిగాడు. గురువారం సాయంత్రం వరకు రంజిత్ లాడ్జి నుంచి బయటకు రాకపోవడంతో.. సిబ్బందికి అనుమానం వచ్చింది. వెంటనే లాడ్జి యాజమాన్యం పోలీసులకు సమాచారం అందజేసింది. పోలీసులు లాడ్జికి చేరుకుని గది తలుపులు తెరిచేందుకు ప్రయత్నించారు. వీలుకాకపోవడంతో బాల్కనీ కిటికీలో నుంచి చూడగా గదిలో ఫ్యాన్‌కు ఆయన ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో గది తలుపులు పగలగొట్టి..లోపలికి ప్రవేశించారు. మృతదేహాన్ని దించి కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో నేవల్ అధికారులు, అతని తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగులకు ప్లంబింగ్‌లో శిక్షణ

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నేక్) సంస్థలో నిరుద్యోగులకు ఉచితంగా ప్లంబింగ్ శిక్షణ అందిస్తున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా అందిస్తున్న ఈ శిక్షణకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న వారు ఈ మూడు నెలల కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 85005 02395 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం కింద ఈ ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు.

14 రోజుల శిశువుకు రెండు శస్త్ర చికిత్సలు

ఆరిలోవ: నెలలు నిండకుండానే జన్మించిన శిశువు కు 14 రోజుల వయసులో రెండు విజయవంతమైన శస్త్ర చికిత్సలు జరిగాయి. ప్రస్తుతం ఆ శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు హెల్త్‌సిటీలోని రెయిన్‌బో ఆస్పత్రి పీడియాట్రిక్ కార్డియోథొరాసిక్ సర్జన్ చౌహాన్ అభినవసింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ ప్రాంతానికి చెందిన గర్భిణి నెలలు నిండకుండానే కవలలకు జన్మనిచ్చారు. ఇద్దరిలో 1.5 కిలోల బరువు ఉన్న శిశువుకు గుండె, కంటి సంబంధిత వ్యాధులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో రెయిన్‌బో ఆస్పత్రిలో గుండె సంబంధిత వ్యాధి అయిన పేటెంట్ డక్టస్ ఆర్టెరియోసస్(పీడీఏ)కు లిగేషన్ కార్డియాక్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స చేసిన తర్వాత రోజే హనుమంతవాక వద్ద ఉన్న ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి ఆ శిశువును తరలించారు. అక్కడ కంటి వైద్య నిపుణులు డాక్టర్ దివ్య, డాక్టర్ శివాని ఆ శిశువు రెండు కళ్లకు గ్లకోమా శస్త్రచికిత్స నిర్వహించి శాశ్వత అంధత్వాన్ని నివారించారు. శస్త్ర చికిత్స జరిగిన అనంతరం తిరిగి రెయిన్‌బో ఆస్పత్రికి తీసుకొచ్చి.. నాలుగు రోజులు పర్యవేక్షించారు. శిశువు ఆరోగ్యం కుదుటపడటంతో డిశ్చార్జ్ చేశారు. 14 రోజుల శిశువుకు ఒక్క రోజు వ్యవధిలో రెండు శస్త్ర చికిత్సలు జరగడం చాలా అరుదైన విషయమని డాక్టర్ అభినవసింగ్ తెలిపారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశం

పరవాడ: సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాల పట్ల సదస్సులు నిర్వహించి.. ప్రజలకు అవగాహన కల్పించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పరవాడ సబ్ డివిజన్ కార్యాలయం, పరవాడ పోలీస్ స్టేషన్లను అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. ముందుగా పోలీసులు డీఐజీకి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. సబ్ డివిజన్ పరిధిలో రోడ్డు భద్రతపై సదస్సులు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి రవాణా జరిగే మార్గాల్లో నిరంతరం తనిఖీలు చేయాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని కేసుల తాజా పరిస్థితిని సమీక్షించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, వాటిని త్వరితగతిన కోర్టుకు నివేదించాలని డీఎస్పీ కె.వి.సత్యనారాయణను ఆదేశించారు.

ముగిసిన పోలీస్ శిక్షణ : పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల పట్ల పోలీసు యంత్రాంగం తక్షణం స్పందించాలని డీఐజీ ఆదేశించారు. ప్రజల ప్రాణాలను కాపాడడంతో పాటు తమను తాము రక్షించుకునేందుకు పోలీసులు సమయస్ఫూర్తితో మెలగాలన్నారు. ఫార్మాసిటీలో ఎంఏఎస్ఆర్ఎం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోలీసు శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ శిబిరాన్ని డీఐజీ సందర్శించి మాట్లాడారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.వి.వి.ఎస్.నారాయణ, జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.వీరభద్రరావు, ఎంఏఎస్ఆర్ఎం సంస్థ కార్యదర్శి జెట్టి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, సభ్యుడు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పరవాడ పోలీస్‌స్టేషన్‌ను సందర్శిస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా

నగరానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాఖ విద్య: రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గురువారం రాత్రి విశాఖకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఉత్తరాంధ్ర ఏజెన్సీ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.

ఎస్సీ యువతకు స్మార్ట్ మీటర్ టెక్నీషియన్ శిక్షణ

ఎంవీపీకాలనీ: ఉమ్మడి విశాఖ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ)యువతకు స్మార్ట్ మీటర్ టెక్నీషియన్లుగా ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) సంస్థ ద్వారా ఎస్సీ యువతకు ఈ శిక్షణ అందించనున్నట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులైన యువత ఈ ఉచిత శిక్షణకు అర్హులని, శిక్షణ సమయంలో నెలకు రూ.7,500 స్టైఫండ్ కూడా అందజేస్తామన్నారు. త్వరలో శిక్షణ ప్రారంభ తేదీని ప్రకటిస్తామని, పూర్తి వివరాలకు 83090 03957 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కిర్రాక్ ఫీచర్లతో వీవో ఎక్స్200 సిరీస్

డాబాగార్డెన్స్: ప్రముఖ మొబైల్ రిటైల్ సంస్థ సెల్ పాయింట్ ఇండియా వీవో ఎక్స్ 200 సిరీస్‌ను గురువారం లాంఛనంగా ప్రారంభించింది. డాబాగార్డెన్స్‌లోని సెల్‌పాయింట్ స్టోర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు పీజీవీఆర్ నాయుడు(గణబాబు), వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ మొబైల్ ఫోన్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ఏ కంపెనీ కొత్త మొబైల్ ఫోన్లను విడుదల చేసినా అవి ముందుగా సెల్‌పాయింట్‌లోనే అందుబాటులోకి వస్తాయన్నారు. వంశీకృష్ణ మాట్లాడుతూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న సెల్‌పాయింట్ అధినేతను ఆయన అభినందించారు. చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే మాట్లాడుతూ విశాఖపట్నంలో తొలిసారిగా డైమండ్ పార్క్ వద్ద సెల్‌పాయింట్‌ను ప్రారంభించామని, ప్రస్తుతం విశాఖలో 29, రాష్ట్ర వ్యాప్తంగా 82 స్టోర్లకు విస్తరించడం సంతోషంగా ఉందన్నారు. వీవో ఎక్స్200 సిరీస్‌లో అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయన్నారు. ఈ సిరీస్ మొబైల్ ఫోన్ల కొనుగోలుపై ఉచితంగా హ్యాపీ పోలా 100 వాట్స్ సౌండ్‌బార్, వీవో బడ్స్ టీడబ్ల్యూఎస్ 3ఈ ఏఎన్‌సీ అందిస్తున్నట్లు తెలిపారు. మరికొన్ని ఉత్పత్తులపై రూ.20 వేల వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు వెల్లడించారు. భాగస్వామ్య బ్యాంకుల ద్వారా 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్, శాంసంగ్, ఎంఐ, ఎల్‌జీ, సోనీ, హైయర్, ఏసర్ వంటి టాప్ బ్రాండ్లపై 50 శాతం వరకు డిస్కౌంట్, యాక్సరీస్‌పై 60 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సెల్‌పాయింట్ ప్రతినిధి బాలాజీ పాండే, వీవో సంస్థ ప్రతినిధి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఫోన్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు గణబాబు, వంశీకృష్ణ, చైర్మన్ మోహన్ ప్రసాద్

పథకాల అమల్లో సమష్టి కృషి



మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ

మహారాణిపేట: ప్రభుత్వ పథకాల అమలులో చురుకైన పాత్ర పోషించాలని, ఇంటి పన్నులు వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ సూచించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో విస్తరణ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ కుటుంబమంతా టీం వర్కుగా పనిచేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, డీపీవో పి.శ్రీనివాసరావు, డీపీఆర్సీ ప్రిన్సిపాల్ ఇ.నాగలక్ష్మి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, విస్తరణ అధికారులు (పీఆర్‌అండ్‌ఆర్‌డీ), అనకాపల్లి, జిల్లా మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

ద్రోణంరాజు సత్యనారాయణకు ఘన నివాళి



ద్రోణంరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, వైఎస్సార్ సీపీ నేతలు

బీచ్‌రోడ్డు: ద్రోణంరాజు సత్యనారాయణ ఒక రాజకీయ విశ్వవిద్యాలయమని, ఎంతో మంది రాజకీయ నాయకులను తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కిందని పలువురు కొనియాడారు. ద్రోణంరాజు సత్యనారాయణ జయంతి పురస్కరించుకుని గురువారం సిరిపురంలోని ఆయన విగ్రహం వద్ద వేడుకలు జరిగాయి. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి, మాజీ రాజ్యసభ సభ్యుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర టైగర్ సత్యనారాయణ అని, ఈ రోజు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఉన్న ఎంతో మంది ఆయన శిష్యులేనని అన్నారు. ఆయన కుమారుడు దివంగత ద్రోణంరాజు శ్రీనివాస్ కూడా నిబద్ధత కలిగిన నాయకుడిగా ఎదిగారని గుర్తు చేశారు. కార్పొరేటర్లు కోడూరి అప్పలరత్నం, బిపిన్ కుమార్ జైన్, ఉరుకుటి చందు, వుడా మాజీ చైర్మన్ రవి, బెహరా భాస్కరరావు, తిప్పల దేవన్ రెడ్డి, జాన్ వెస్లీ, మంత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వదలని వర్షం



నగరంలో జోరు వాన

మహారాణిపేట: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో నగరం తడిసి ముద్దయింది. మంగళవారం రాత్రి నుంచి వర్షం పడుతూనే ఉంది. పాత పోస్టాఫీసు, జగదాంబ, పూర్ణామార్కెట్, హెచ్‌బీకాలనీ, మద్దిలపాలెం, వెంకోజీపాలెం, ఆదర్శనగర్, అక్కయ్యపాలెం, మధురవాడ తదితర ప్రాంతాల్లో గురువారం వర్షం కురిసింది. వదలని వర్షంతో ప్రజలు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మరో వైపు సముద్రం అల్లకల్లోలంగా మారింది. తీరంలో కెరటాలు ఎగిసిపడుతున్నాయి. కోస్టల్ బ్యాటరీ వద్ద రాళ్లను బలంగా తాకుతున్నాయి. చలి తీవ్రత కూడా పెరిగింది.



ఎగిసి పడుతున్న అలలు